# సిరియాలో అంతర్యుద్ధాన్ని తీవ్రంచేస్తున్న సామ్రాజ్యవాదుల నడుమ వైరుధ్యాలు

**సిరియాలో** అస్సాద్ ప్రభుత్వాన్ని కూలదోసే కుటిల లక్ష్యంతో, అమెరికా సామ్రాజ్యవాదం ఆ దేశంలో రేపిన, ఐదు సంవత్సరాలుగా సాగుతోన్న అంతర్యుద్ధానికి ముగింపు పలికేందుకు ఓ కార్యక్రమాన్ని నిర్ణయిస్తూ ఐక్యరాజ్యసమితి భద్రతామండలి ఏకగ్రీవంగా ఓ తీర్మానాన్ని ఆమోదించింది. ఆ సంక్షోభానికి రాజకీయ పరిష్కారం కనుగొనటం గురించి కూడా ఈ తీర్మానం పేర్కొంది.

ఈ తీర్మానం ప్రకారం 2016 జనవరి నాటికి కాల్పుల విరమణతో ఈ క్రమం ప్రారంభం కావాలి. అదే సమయంలో ప్రభుత్వానికి, ప్రత్యర్థి శక్తులకు నడుమ మధ్యంతర ప్రభుత్వ ఏర్పాటు గురించి చర్చలు జరిగి, ఆరునెలల కాలంలోపు నూతన ప్రభుత్వం ఏర్పాటు కావాలి. ఆ తర్వాత 18 నెలల కాలంలో ఐక్యరాజ్య సమితి పర్యవేక్షణలో దేశంలో ఎన్నికలు జరగాలి.

అయితే, ఈ తీర్మానం కాల్పుల విరమణ ఎవరెవరికి నడుమ జరుగుతుంది; చర్చలలో ఎవరెవరు పాల్గొనబోతున్నారు; మధ్యంతర ప్రభుత్వం ఎవరెవరితో కూడి వుంటుంది; అలాగే ఎన్నికలు నిర్వహించటానికి ఎవరికి అనుమతి ఇవ్వబోతున్నారనే ప్రశ్నలకు జవాబులు చెప్పకుండా వదిలేసింది.

సామ్రాజ్యవాద శక్తుల ఆధిపత్య ప్రయోజనాల మధ్య లోతైన విభేదాలు, సిరియా సంక్షోభానికి కారణాలుగా వున్నాయి. మధ్యప్రాచ్యంలోని సంపన్నమైన చమురు వనరులపై ఆధిపత్యాన్ని నెలకొల్పుకొనే ప్రయత్నంలో భాగంగా, అమెరికా సామ్రాజ్యవాదం, సిరియాలో అస్సాద్ అధ్యక్షుడుగా వున్న ప్రభుత్వాన్ని మార్చాలన్న ప్రచారం సాగిస్తూ వస్తోంది. ప్రతిపక్షంగా చెప్పబడుతున్న అల్‌ఖైదా సంబంధిత గ్రూపులను సృష్టించి, అమెరికా వారికి ఆర్థికాన్ని, ఆయుధాలను సమకూర్చింది. సౌదీ అరేబియా, టర్కీ, ఖతార్‌లు ఈ క్రీడలో ప్రత్యక్ష భాగస్వాములు కాగా, ఇతర పశ్చిమ దేశాల సామ్రాజ్యవాద శక్తులు దీనికి మద్దతుదారులుగా వున్నాయి.

మరోవైపున, మధ్యప్రాచ్యంలో రష్యాకున్న ఏకైక మిత్రదేశమైన సిరియాను చేజారనీయకుండా, సిరియా ప్రభుత్వ బలగాలు సాగించే దాడులకు మద్దతుగా రష్యా తన వాయు సేనలను పంపి సహకారమందజేస్తోంది.

అస్సాద్‌ను తొలగించాలని అమెరికా సామ్రాజ్యవాదం వత్తిడి తెస్తుండగా, 'ఉగ్రవాదాని'కి వ్యతిరేకంగా అస్సాద్‌కు రక్షణగా రష్యా మద్దతుగా నిలుస్తోంది. సిరియాలో ప్రభుత్వాన్ని మార్చే ఎలాంటి ప్రయత్నాన్నైనా రష్యా వ్యతిరేకిస్తోంది.

ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానంలో – అస్సాద్‌ను నిరాకరిస్తున్నట్లుగా గానీ లేదా తీర్మానం అమలుచేసే క్రమంలో అస్సాద్ పాత్ర లేకుండా నిరాకరించటం గానీ చేయలేదు. ముసుగులోనున్న శక్తుల నడుమ లోతైన విభేదాలను మరుగుపరిచే ప్రయత్నమే ఈ తీర్మానం. అయితే అతి త్వరలోనే ఆ శక్తులు ముసుగు తొలగించుకొని వేగంగా బయటకు వస్తాయనేది నిస్సందేహం.

ఇప్పటికే ఆ లక్షణాలు కన్పడుతున్నాయి. సౌదీ అరేబియా – పశ్చిమ దేశాలలో నివసించే ప్రవాస నాయకులను కొందరిని సమీకరించి, వారిచే అస్సాద్‌ను తొలగించాలని డిమాండ్ చేయిస్తోంది. వారిలో ఒకరైన రియాద్ హిజెబ్‌ను అస్సాద్ వ్యతిరేక ప్రత్యర్థిశక్తుల 'ప్రధాన సమన్వయకర్తగా' ఎంపిక చేసుకున్నారు. 2012లో అస్సాద్, హిజెబ్‌ను సిరియా ప్రధానమంత్రిగా నియమించాడు. అయితే 2 నెలల కాలంలోనే, అస్సాద్ ప్రభుత్వాన్ని కూలదోసే ప్రయత్నాలలో భాగంగా ఫ్రెంచ్ గూఢచార విభాగం హిజెబ్‌కు డబ్బు అందజేయటం వెల్లడయింది.

'తిరుగుబాటుదారు'లెవరు అనేది మరో ముఖ్యమైన విబేధాలున్న అంశం. ఐక్యరాజ్యసమితి తీర్మానం, టెర్రరిస్టు గ్రూపులను ఈ క్రమం నుండి మినహాయించింది. అయితే, ఏవి టెర్రరిస్టు గ్రూపులు, ఏవి ప్రతిపక్షాలు అనేది జవాబులేని ప్రశ్నగా వదిలి వేసింది. రెండుపక్షాలూ ఐఎస్ఐఎస్‌ను టెర్రరిస్టు గ్రూపుగా అంగీకరిస్తాయి. అమెరికా తాను ఏ గ్రూపును టెర్రరిస్టు గ్రూపుగా పరిగణిస్తోందో నిర్దిష్టంగా పేర్కొనటానికి సిద్ధంగా లేదు. టెర్రరిస్టు గ్రూపుల జాబితాను తయారుచేసే బాధ్యతను జోర్డాన్‌కిచ్చారు. ఈ ప్రాంతంలోని ఇతర దేశాలతో చర్చించిన పిమ్మట 20కి పైగా టెర్రరిస్టు గ్రూపులున్నట్లుగా జోర్డాన్ ఓ జాబితాను తయారుచేసింది. వీటిలో అత్యధిక గ్రూపులకు అమెరికా సామ్రాజ్యవాదం లేదా సిఐఏ ఆయుధ, సైనిక సహాయాలనందిస్తోంది.

ఐక్యరాజ్యసమితిలో ఈ తీర్మానంపై ఓటింగ్ జరుగుతున్న సమయంలోనే, ఐఎస్ఐఎస్‌కు, ఇతర టెర్రరిస్టు గ్రూపులకు వాహక నాళంగా సిరియా, టర్కీ సరిహద్దులో సైన్యాన్ని మోహరిస్తున్నట్లుగా 'నాటో' పేర్కొంది. అదే సమయంలో టర్కీకి సరిహద్దులోని సిరియా స్థానిక స్థావరమైన మేయిమిమ్‌లో అత్యాధునిక యుద్ధవిమాన వ్యవస్థను మోహరించినట్లుగా రష్యన్ సైన్యం ప్రకటించింది. 36 విమానాలను వెంటవెంటనే నేలకూల్చగల సామర్థ్యం ఈ వ్యవస్థకుంది.

సామ్రాజ్యవాద శక్తులు శాంతి గురించి మాట్లాడుతూ అదే సందర్భంలో సైనికచర్యలు, సన్నాహాలు చేపట్టటమనేది సిరియాలో అంతర్యుద్ధం మరింత తీవ్రం కాబోతున్నదనీ, సిరియా ప్రజానీకం యొక్క జీవితాలు మరింతగా విధ్వంసం కానున్నాయని సూచిస్తోంది. సామ్రాజ్యవాద శక్తుల నడుమ దోపిడీవర్గ ప్రయోజనాలకోసం సాగే ఘర్షణ సిరియాలో అంతర్యుద్ధానికి దారితీయటమేగాక, ప్రస్తుత సంక్షోభానికి మూలకారణంగా వుంది. సిరియా, మధ్యప్రాచ్యంలోనేకాక, యావత్ ప్రపంచంలోని శ్రామిక ప్రజానీకం, శాంతికాముక ప్రజానీకం–సామ్రాజ్యవాదుల ఆధిపత్యం, సైనికజోక్యాలను ప్రతిఘటించకుండా శాంతినెలకొనటం అసాధ్యం.

ooooo